# 15

## అన్నమో రామచంద్రా!

అంజమ్మ పుట్టిన మూడేళ్ళకు మనకు స్వరాజ్యం వచ్చింది. స్వరాజ్యం రావడానికీ అంజమ్మ పుట్టడానికీ కొంత సంబంధం ఉంది. అంజమ్మ తండ్రి పేరు నరసారెడ్డిగారు. ఆ కాలంలో ఆయన పేరు మోసిన దేశభక్తుడు కాదు. అసలాయన ఉన్న వాతావరణంలో, ఖాదీ గట్టడమే గొప్ప. ఖాదీని కట్టుకోమని, తన చుట్టూ వున్నవారిని బలవంతం చేయడం యింకా గొప్ప. పోలీసుల్ని కాదని, సభల్లో పాల్గొనడం, అప్పుడప్పుడు ఉపన్యాసాలివ్వడం మరీ గొప్ప, ఈ 'గొప్ప'లన్నీ మన దృష్టిలో, సర్కారువారి దృష్టిలో ఇవన్నీ నేరాలేగదా. నేరం చేసినప్పుడు శిక్ష అనుభవించవలసిందేగదా. నరసారెడ్డిగారు కూడా శిక్ష అనుభవించారు.

నరసారెడ్డిగారికి, రావుబహద్దూర్ వెంకట్రామారెడ్డిగారికి చాలా దూరంగా బంధుత్వం వుంది. నరసారెడ్డిగారి చుట్టాలు వెంకట్రామారెడ్డిగారిని కలుసుకొని మంతనాలు జరిపారు. బంధుత్వాన్ని కాదనలేరు. తన బాధల్నీ కాదనలేరు పింగళి వెంకట్రామరెడ్డిగారు. ఆయన ఏం చేశాడో మనకయితే తెలీదుగానీ, నరసారెడ్డిగార్ని మాత్రం నిజాం పోలీసులు వదిలిపెట్టారు.

1944వ సంవత్సరంలో హైదరాబాదు సంస్థాన రాజకీయాలు, పరమ గందరగోళంగా వున్నాయి. బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు ముందుముల నరసింగరావు, రంగారెడ్డి, రావినారాయణరెడ్డి, ముగ్దుం మొహియుద్దీన్ వంటి దేశభక్తులు ప్రభుత్వంతో ప్రత్యక్షంగానూ, అలా సాధ్యం కానప్పుడు పరోక్షంగానూ పోరాటాలు జరుపుతున్నారు. గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభల పేరున రాజకీయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. సరిగ్గా ఆ సమయంలో పుట్టింది అంజమ్మ.

నరసారెడ్డిగారు ఇప్పటి దాకా ఉంటే తప్పకుండా మంత్రి అయి వుండేవాడో కాదో గాని రెండు చేతులా సంపాదించుకొనే అవకాశాలు మాత్రం ఆయనకుండేవి. ఉన్నా ఆయన దగ్గర అలా సంపాదించుకొనే లక్షణాలు లేవంటారు ఆయనెరిగిన వాళ్లు. ఆయన ఆ రోజుల్లోనే చాలా ఆస్తిని తగలేసుకొన్నాడు. ఆయనతో పాటు పోరాటంలో పనిచేసిన వాళ్ల మంచి మంచి పదవుల్లో వుండీ 'కానుకలు' అందుకొని, 'పార్టీ ఫండు' వసూలు చేసుకొనీ నిశ్చింతగా వున్నారు. ప్రభుత్వంలోకి వస్తూనే, తమకూ, తమవారికీ కావలసినవన్నీ చేసుకొన్నారు. నరసారెడ్డిగారు బతికేవుంటే ఈ లత్కోరు పనులు చేసి వుండేవారనుకోవడం మహాదోషం.

సంస్థానంలో పోరాటం ఉధృతం అవుతున్నప్పుడు కాశీం రజ్వీ రంగంలో కొచ్చాడు. రజకార్లు సంస్థానమంతటా ఇసుళ్ళలా పుట్టుకొచ్చారు. వారికీ, స్వాతంత్ర్య యోధులకూ, బాహా బాహి యుద్ధలు జరిగాయి. ఆ యుద్ధంలోనే నరసారెడ్డి చచ్చిపోయాడు. అప్పటికి అంజమ్మ వయస్సు నాలుగు సంవత్సరాలు.

పోయిందంతా పోగా మిగిలిన ఆ కాస్త భూమితోనే యల్లమ్మ సంసారాన్ని నెట్టుకు రాసాగింది. అంజమ్మ కాక ఆమెకింకా ముగ్గురు పిల్లలున్నారు. నరసారెడ్డిగారిమీద గల రాజకీయ కక్షతో ప్రత్యర్థులు యల్లమ్మను నానా కష్టాలపాలు చేశారు. ఆ రోజుల్లో సాగుభూములకు, పట్టాలు, దస్తావేజులు, రిజిస్ట్రేషన్లు ఉండేవి కావేమో, ఉన్నా ఆ గొడవలన్నీ యల్లమ్మగారికి తెలియవేమో, మొత్తమీద

తేలిందేమిటంటే ఆమె సాగుకింద వున్న భూమిని అంతకుముందెప్పుడో నరసారెడ్డిగారు ఇంకెవరికో అమ్మేశారు. ఇది అన్యాయమని రుజువు చేసుకోలేకపోయారు. ఫలితంగా యల్లమ్మ సంసారం వీధిన పడింది.

"ఆ తరువాత కథ చెప్పాలంటే ఏళ్ళూ పూళ్ళూ పడుతుంది నాయనా; ఎప్పుడన్నా తీరిగ్గా చెబుతాను. అయినా ఇదంతా ఎందుకడుగుతున్నట్టు బిడ్డా?" అన్నది అంజమ్మ అనుమానంగా.

ఎందుకడుగుతున్నదీ వివరించాక కళ్ళనీళ్ళు పెట్టుకొంది "ఇంత కాలంగా నా దగ్గరకొచ్చిన వాళ్ళూ లేరు. ఈ సంగతులన్నీ అడిగిన వాళ్ళూ లేరు". అంటూ మళ్ళా ప్రారంభించింది అంజమ్మ.

ఆమెకు పెళ్ళయింది. వెంకురెడ్డి మొజాం జాహి మార్కెట్ దగ్గరున్న పళ్ళ కమీషన్ కొట్లల్లో పనిచేసేవాడు. లారీల్లో వచ్చిన సరుకును దింపడం, లెక్క సరిగ్గా వుండేట్లు చూసుకోవడం - ఇత్యాది పనులన్నీ వెంకురెడ్డి చేస్తూ వుండేవాడు. ఏడెనిమిదేళ్ళపాటు సంసారం బాగా జరిగింది. ఒకసారి తాగివున్న లారీ డ్రైవరు బండిని అడ్డగోలుగా తిప్పడంతో వెంకురెడ్డి లారీకిందపడి నజ్జునజ్జయిపోయాడు. 'సర్కారు దవాఖాన'కు తీసుకుపోతున్న సమయంలోనే అతను శాశ్వతంగా కళ్ళుమూశాడు.

"అప్పటికే నాకు ముగ్గురు కొడుకులున్నారయ్యా. భగవంతుడు నా తోడు తీసుకుపోయాడు. తోడబుట్టినవాళ్ళదీ అంతంత మాత్రమేనాయె. ఏం చెయ్యను బిడ్డా! సద్దామనుకొన్నా. కానీ పసిబిడ్డల్ని వొదిలి సావలేకపొయ్యా". అని భోరుమన్నది అంజమ్మ.

ఎవరో దయామయులు చందాలేసుకొని ఈ బండి కొనిపెట్టారుట. కొంత కాలం ఈ బండిమీద ఉల్లిపాయలు, చింతపండు, మిరపకాయలు, కూరగాయలు పెట్టి అమ్మిందట. దాని వల్ల నికరాదాయమంటూ లేదుట. పైగా అప్పులు కూడా పెట్టాలిసొచ్చేదట. అప్పలడిగితే తక్కువ లెక్కలు చెప్పడం, ఎగవేయడం, తగాదాలాడడం- ఈ తలనొప్పి భరించలేక ఆ పని మానేశానన్నది అంజమ్మ.

మళ్ళా ఇబ్బందులూ, కష్టాలూ అంజమ్మను ముసురుకొన్నాయి. చిన్నబిడ్డలు ఆకలికి తాళలేక, చిన్న చిన్న దొంగతనాలు చేసేవారుట. సరిగ్గా ఆ సమయంలోనే ఇదుగో ఇప్పుడు చేస్తున్న ఈ పని దొరికింది. ప్రారంభంలో అయిదారుగురికన్నా అన్నం తెప్పించుకొనేవారు కాదుట.

"ఇప్పుడు ఇరవై రెండు మంది దాకా దొరికారయ్యా. పెద్ద పిల్లలిద్దరూ ఇళ్ళకెళ్ళి సంచులూ, టిఫెనుగిన్నెలూ పట్టుకొస్తారు. దోవలో వున్న యిళ్ళ నుంచి నేనే తీసుకొంటాను. సమయానికి అన్నం అందించకపోతే అయ్యలకు కోపం. ఇళ్ళ దగ్గరేమో - 'ఇదిగోవస్తి- అదిగోవస్తి' నంటూ ఆలస్యం చేస్తారు. వానయ్యేది. వరదొచ్చేది, ఎండలయ్యేది. సలిపీక్కు తినేది- నేను మాత్రం మానుకోను నాయనా. ఎందుకన్నా మంచిదని మా పెద్దోడిక్కూడా నేర్పి వుంచా... దూరాన్ని బట్టి రేటు... ఉ ంటుంది బిడ్డా. 5 రూపాయల్నించీ, 10 దాకా యిస్తారు. అయ్యలు తినిపోగా మిగిలందాన్ని నేను మూటగట్టుకొని నా బిడ్డలకు పెట్టుకొంటాను నాయనా.

"అద్దె కొంప. ముప్పయ్ యిస్తున్నా పిల్లలకు చదువూలేదు. చట్టుబండలూ లేదు. ఇంకెప్పుడన్నా తీరిగ్గా రా బిడ్డ అన్నీ వివరంగా చెబుతా"అంటూ అన్నం బండిని తోసుకుపోయింది అంజమ్మ.